క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి రూ. 5.40 కోట్లు మంజూరు



మాట్లాడుతున్న రామనాథం

రామడుగు: జిల్లాలో పలు ఆలయాల అభివృద్ధికి శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం రూ.5.40 కోట్ల నిధులు విడుదల చేసిందని టీటీడీ దేవస్థానం పరిశీలకుడు డాక్టర్ రామనాథం తెలిపారు. మండలంలోని వెలిచాలలో టీటీడీ దేవస్థానం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పలు అభివృద్ధి పనులకు రూ.పది లక్షలు మంజూరు కాగా శుక్రవారం దేవాలయాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. భజన మండలి భవనం నిధులతో చేపడతామన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు, రైతు బంధు జిల్లా కమిటీ సభ్యులు వీర్ల సంజీవరావు, మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు, సభ్యులు చంద్రప్రకాశ్, అనిల్‌కుమార్, పూజారి సాయికిరణ్ పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు చేయొద్దు

చిగురుమామిడి: పక్క నియోజకవర్గాల అభివృద్ధిపై మాట్లాడే అర్హత మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు లేదని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం చిగురుమామిడిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉండగా కాంగ్రెస్ ఏమేరకు అభివృద్ధి చేసిందో చెప్పాలన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు మాట్లాడాలి, వ్యక్తిగత దూషణలకు పాల్పడితే హుస్నాబాద్ నియోజకవర్గంలో తిరుగనివ్వమని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజయ్య, రైతుబంధు సమితి మండలశాఖ అధ్యక్షుడు తిరుపతి, సింగిల్‌విండో చైర్మన్‌వెంకటరమణారెడ్డి, వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రవి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మల్లేశం, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి జెడ్పీ పాఠశాలలో శుక్రవారం ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు జీవితం అంటే ఏమిటో అర్థమయ్యేలా చెప్పాలని ఇంపాక్ట్ ఫౌండేషన్ ఈడీ వెంకట్రావ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య అనేది ఫైనల్ ఎగ్జామ్‌లో మార్కులు తెచ్చుకోవడం కాదని, విజ్ఞానాన్ని పరిపూర్ణంగా నేర్చుకున్నప్పుడే చదువుకు ఉన్న విలువ తెలుస్తుందన్నారు. విద్యార్థులు పక్కవారితో పోల్చుకోవద్దని, తమ విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ట్రైనర్ కూతాడి తిరుపతి, హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు, గాదె రఘునాథరెడ్డి, పూర్వ విద్యార్థి బుర్ర భరత్ పాల్గొన్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ నిర్వాహకులను హెచ్‌ఎం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

నియామకం

జమ్మికుంట: ఎన్‌ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మహ్మద్ ఇమ్రాన్‌ను నియమిస్తూ ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఇమ్రాన్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, నియామకానికి సహకరించిన ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి థామస్, మన్యపు జీవన్, రిషత్‌రావు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ముందస్తు శ్రీకృష్ణాష్టమి



వేడుకల్లో నరేందర్‌రెడ్డి

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ స్కూల్‌లో శుక్రవారం ముందస్తు శ్రీ కృష్ణాష్టమి ఘనంగా నిర్వహించారు. వేడుకలకు అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. శ్రీకృష్ణుడు ఆదర్శమూర్తి, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. ఉట్టి కొట్టే వేడుకల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్వలలో సివిల్ రైట్స్ డే

శంకరపట్నం: మండలంలోని కల్వల గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలోని పలు సమస్యలను కాలనీప్రజలు అధికారులకు విన్నవించారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని తహసీల్దార్ అనుపమ సంబంధిత అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ భద్రయ్య, ఆర్‌ఐ లక్ష్మారెడ్డి, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే అంతే..

- రహదారి వెంట ప్రమాదకరంగా వ్యవసాయబావులు
- సూచికబోర్డులు, రక్షణ చర్యలు ఏర్పాటు చేయని వైనం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



మానకొండూర్ శివారులో రహదారి పక్కన ప్రమాదకరంగా వ్యవసాయబావి

మానకొండూర్: మానకొండూర్ నుంచి జమ్మికుంటకు వెళ్లే రహదారిపై ప్రయాణం అంటేనే ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. డబుల్ రోడ్డు కావడంతో వాహనాలు రయ్‌మంటూ దూసుకెళ్తున్నాయి. అయితే రహదారి వెంట ఉన్న వ్యవసాయబావుల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు ఏర్పాటు చేయలేదు. వాహనదారులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా నేరుగా వాహనాలు వ్యవసాయబావుల్లోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. ప్రమాదాల నివారణ కోసం ఆర్‌అండ్‌బీ అధికారులు సేఫ్టీ రాడ్స్ కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపి నెలలు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది.

మానకొండూర్ నుంచి పచ్చునూర్ 13వ కిలోమీటరు వరకూ రోడ్డును ఆనుకొని ఆరు వ్యవసాయబావులు ఉన్నాయి. రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా బావులు వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. గతంలో అన్నారం గ్రామ శివారులోని వ్యవసాయబావిలో రాత్రి వేళ అన్నారం గ్రామానికి చెందిన యువకుడు కారులో ఇంటికి వస్తుండగా అదుపుతప్పి బావిలో పడిపోగా అదృష్టవశాత్తు క్షేమంగా బయటపడ్డాడు. మానకొండూర్ జమ్మికుంటకు డబుల్ రోడ్డు మంజూరుకావడంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ తారురోడ్డు వేసి ఇరువైపుల మట్టి పోసి సైడ్‌బర్మ్‌లు ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోయి అనేక చోట్ల గండ్లు ఏర్పడ్డాయి. తారు వరకూ గండి పడటంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదం బారిన పడే అవకాశం లేకపోలేదు. ఇటీవల వీణవంక నుంచి మానకొండూర్ వైపు వస్తున్న ఓ ఇసుక లారీ పచ్చునూర్ శివారులో అదుపు తప్పి పంట పొలాల్లో పడిపోయింది. ఆ సమయంలో కూలీలు పంట పొలాల్లో కలుపు తీస్తుండగా ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు.

రక్షణ చర్యలు చేపట్టాలి

ప్రయాణికుల సౌకర్యార్థం మానకొండూర్–జమ్మికుంట వరకు డబుల్ రోడ్డుగా మార్చారు. ప్రయాణికుల ప్రాణాల రక్షణ కోసం మాత్రం ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయబావుల వద్ద రక్షణ చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ప్రయాణికులు, వాహనదారులు సంబంధిత అధికారులపై మండిపడుతున్నారు. మానకొండూర్ జమ్మికుంట రహదారి ఇటీవల కాలంలో బాగా రద్దీగా మారింది. అనేక ఇసుక లారీలు దారి గుండా రాత్రివేళ ప్రయాణిస్తుంటాయి. ప్రమాదాలు జరగక ముందే బావుల వద్ద, ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నివేదిక పంపాం

మానకొండూర్ నుంచి పచ్చునూర్ వరకూ తారురోడ్డు పూర్తయింది. రహదారి వెంట వ్యవసాయబావులు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటి వద్ద రక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపాం. రోడ్డు వెంట ఏర్పడిన గండ్లు పూడ్చివేస్తాం. అలాగే అన్నారం చెరువు కట్టపై టర్నింగ్‌లో కూడా రెయిలింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నాం.

– శానగొండ రాజశేఖర్, ఏఈ ఆర్‌అండ్‌బీ

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



జమ్మికుంట: తనిఖీ చేస్తున్న సీఐ, పోలీసులు



తిమ్మాపూర్: అల్గునూర్ చౌరస్తాలో..

జమ్మికుంట: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ బార్పటి రమేశ్ అన్నారు. శుక్రవారం రాత్రి మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో డ్రంకెన్‌డ్రైవ్, వాహనాల తనిఖీ చేపట్టారు. నెంబర్ ప్లేట్ లేని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఏడుగురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీధర్, ఏఎస్‌ఐ రవి, పీసీ సురేందర్, హోంగార్డు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధి లోని అల్గునూర్ చౌరస్తాలో శుక్రవారం తిమ్మాపూర్ సర్కిల్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌ఎండీ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఫింగర్ ప్రింట్ డివైస్‌లతో అనుమానితులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేశామని సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. తనిఖీల్లో మానకొండూరు సీఐ రాజుకుమార్, ఎల్‌ఎండీ ఎస్‌ఐ ప్రమోద్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు



జమ్మికుంట: వినతిపత్రం ఇస్తున్న ఏఎన్‌ఎంలు

జమ్మికుంట: పదిహేడు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కరోనా సమయంలో ప్రాణాలు లెక్క చేయకుండా ప్రజలకు సేవ చేశామని, 18 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నావారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. సమాన పనికి సమానవేతం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో శ్యామల, సాజిద పర్వీన్, రమ, రజిత, సంధ్య పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు శుక్రవారం విధులు బహిష్కరించి భిక్షాటన చేశారు. ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

ఎన్నికలొస్తేనే ప్రజలు గుర్తొస్తారు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

గన్నేరువరం: ఎన్నికలు రాగానే ప్రతిపక్షాలకు ప్రజలు గుర్తొస్తారని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని ఖాసీంపేట బీఆర్‌ఎస్ గ్రామశాఖ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికలు రాగానే మాయమాటలు చెప్పి ఊసరవెల్లిలా రంగులు మారుస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. రైతుబంధు, రైతుబీమా, ఆసరా పెన్షన్లు, దళితబంధు, బీసీబంధు, 24 గంటల విద్యుత్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మైనార్టీ బంధు పథకాలతో సీఎం కేసీఆర్ ప్రజలకు అండగా ఉంటున్నారని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజల్లో ఉంటూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్‌ఎస్‌ను ఆదరించి, మూడోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకన్న, మానసాదేవి ఆలయ కమిటీ చైర్మన్ చంద్రారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు చంద్రయ్య, ఆర్‌ఎస్‌ఎస్ మండల కోఆర్డినేటర్ తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, గ్రామ కోఆర్డినేటర్ సందవేని తిరుపతి, కయ్యం సంపత్, కొమురయ్య, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలని, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం సూచనలు తీసుకుంటూ చదువుల్లో రాణించాలని కిట్స్ కళాశాలల కార్యదర్శి, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ కళాశాలలో శుక్రవారం ప్రథమ సంవత్సర విద్యార్థుల తల్లిదండ్రులకు ఓరియేటేషన్ కార్యక్రమం ప్రిన్సిపల్ డాక్టర్ కందుకూరి శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో అద్భుతమైన సౌకర్యాలు ఉన్నాయని వాటిని విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో కూడిన చదువునభ్యసిస్తే భవిష్యత్‌లో స్థిరపడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



గన్నేరువరంలో నిరసన వ్యక్తం చేస్తున్న టీచర్లు



రామడుగు: గోపాల్‌రావుపేటలో...



వీణవంక: చల్లూర్‌లో...

గన్నేరువరం: కొత్త పెన్షన్ అమలుతో సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినంగా నిలిచిపోయిందని, సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గన్నేరువరం పాఠశాలలో టీచర్లు నల్ల బ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. పెన్షన్ పొందడం ప్రభుత్వ ఉద్యోగికి రాజ్యాంగం కల్పించిన హక్కు, ప్రజాప్రతినిధులకు పెన్షన్ ఉండి 30 సంవత్సరాలు ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషించే ఉద్యోగులకు పెన్షన్ లేకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. జాక్టో చైర్మన్ ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రవీంద్రాచారి, ఎంఈవో కె. శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు ఎ. శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, నరేందర్ పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామం ఏకశిలా పాఠశాలలో హుజూరాబాద్ డివిజన్ స్థాయి ఉన్నత శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు సీపీఎస్ రద్దు చేయాలని నిరసన తెలిపారు. పీఆర్టీయూ హుజూరాబాద్ మండల అధ్యక్షుడు మాధవరావు, రాష్ట్ర నాయకులు సత్యం, యూటీఎఫ్ జిల్లా నాయకులు శ్రీనివాసరావు దేశ్‌ముఖ్, డీటీఎఫ్ ఇల్లందకుంట మండల ప్రధాన కార్యదర్శి, అధ్యక్షుడు సీహెచ్ వేణు ఉన్నారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల ప్రధాన కార్యదర్శి వి. రాజమౌళి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వేణుకుమార్, సంఘం బాధ్యులు జలపతిరెడ్డి, జానకీదేవి, రత్నప్రభ, అస్గర్‌అలీ, శ్రీదేవి, జ్యోతి, శ్రీనివాస్‌రెడ్డి, రేణుక, హరిప్రియ, స్వరాజ్యలక్ష్మి, జయశ్రీ పాల్గొన్నారు.

వీణవంక: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నందికొండ విద్యాసాగర్ అన్నారు. చల్లూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై టీఆర్‌టీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే పాత పెన్షన్ పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీచర్ చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార వారోత్సవం



గర్భిణులకు సూచనలిస్తున్న వైద్యాధికారి

రామడుగు: పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని గోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్వేత తెలిపారు. మండలంలోని గోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు విజయ, సావిత్రి, పద్మజ, లావణ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

వనదేవతలకు పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

సైదాపూర్: మండలంలోని లస్మన్నపల్లిలో శుక్రవారం బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్తులు సామూహిక వనభోజనాలకు వెళ్లారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు, ప్రజలను చల్లగా చూడాలని గ్రామ, వనదేవతలకు పూజాలు చేశారు. కార్యక్రమంలో వెన్నంపల్లి మాజీ ఎంపీటీసీ రాజు, ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు సమ్మయ్య, అశోక్, తిరుపతి, కొమురయ్య, తిరుపతి, ఊడిగె వెంకటయ్య, బైరి రమేష్, పెసర శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తిమ్మాపూర్: మండలంలోని మల్లాపూర్ ఎంపీటీసీ పుప్పాల కనకయ్య కుమారుడు సతీశ్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సతీశ్ మృతదేహానికి మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నివాళి అర్పించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, సర్పంచ్ సతీష్, పాశం అశోక్ రెడ్డి, ఉపసర్పంచ్ బుడిగె పర్శరాములుగౌడ్, మన్నెంపల్లి ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్, ముంజం శ్రీనివాస్, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భద్రయ్యకు నివాళి

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రేణుకుంట్ల భద్రయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందగా ఎంపీపీ సరిగొమ్ముల పావని వెంకటేశ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు రఫీఖాన్, సత్యనారాయణరావు, తిరుపతిరెడ్డి, రాయుడు పాల్గొన్నారు.

‘నా మట్టి నా దేశం’లో బీజేపీ నాయకులు



ఇల్లందకుంట: మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్: స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఢిల్లీలో నిర్మించతల పెట్టిన అమరవీరుల స్థూపం ఏర్పాటుకు వివిధ రాష్ట్రాల నుంచి మట్టి సేకరణకు నా మట్టి.. నా దేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మట్టి సేకరణ చేపట్టారు. మండలంలోని కందుగుల గ్రామంలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మట్టి సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. అసెంబ్లీ కన్వీనర్ గౌతం రెడ్డి, మండల ఇన్‌చార్జి సంపత్‌రావు, మండల అధ్యక్షుడు కుమార్, జిల్లా కార్యదర్శి కరుణాకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడువిజేందర్‌రెడ్డి, సర్పంచ్ మహేందర్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడు మహేశ్, రవీందర్, ప్రధాన కార్యదర్శి కొండాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల గ్రామంలో మట్టి సేకరణ కార్యక్రమానికి గ్రామ దేవాలయంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. మట్టి సేకరణ కార్యక్రమంతో ప్రజల్లో దేశభక్తి పెంపొందుతుందన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కర్ణాకర్, సర్పంచులు సాంబయ్య, ఎల్లారెడ్డి, వైస్ ఎంపీపీ ఆరెల్లి జ్యోత్స్నశ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణ ప్రజలు భాగస్వామ్యంతో నా మట్టి నా దేశం కార్యక్రమం విజయవంతం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్ పిలుపునిచ్చారు.పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో ఇంటింటికి తిరుగుతూ మట్టి సేకరించారు. నాయకులు రవి, స్వామి, స్వరుప, రవిచంద్రారెడ్డి, జగన్, అశోక్, రాజు,తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని ఖాసింపేట్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో నా మట్టి.. నా దేశం కార్యక్రమం నిర్వహించారు. మానకొండూర్ అసెంబ్లీ కన్వీనర్ జగన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికీ తిరిగి మట్టి సేకరించారు. జగన్ మోహన్, సత్తయ్య, రాజశేఖర్, పర్శరాంగౌడ్, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తిమ్మాపూర్: ప్రజలందరిలో జాతీయ స్ఫూర్తిని కలిగించడమే బీజేపీ ప్రధాన లక్ష్యమని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీ తిమ్మాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో పొరండ్లలో మేరా మిట్టి–మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ జెండా చేతబూని, గ్రామంలోని కొంతమంది ఇంటికి వెళ్లి, కార్యక్రమాన్ని వివరించి, కలశంలో మట్టి సేకరించారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి కిన్నెర అనిల్, నాయకులు శ్రీనివాస్, రవి, విశ్వరూపం, వెంకటేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్నకొండలో గడపగడపకూ కాంగ్రెస్



శంకరపట్నం: కాంగ్రెస్‌లో చేరిన యువకులు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం తిరుపతిగౌడ్, రాజేశం, లచ్చయ్య, రంగన్న, ఆదిరెడ్డి, గంగయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో మానకొండూరు నియోజకవర్గ యువజన విభాగం నాయకుల సమావేశంలో మాట్లాడారు. గెలుపు కోసం కార్యకర్తలు గడపగడపకూ తిరగాలని, పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఇంతియాజ్ మున్వర్ , తిప్పారపు సంపత్, పులి కృష్ణ, గంప మహేష్, కృష్ణబాబు, రమేశ్, శ్రావణ్, మణిదీప్, కొండ్ర సురేష్, అజయ్, నవీన్, రాకేశ్, పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని లింగాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు, మానొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ పర్యటించారు. రాబోయే ఎన్నికల్లో గెలుపుకోసం కార్యకర్తలు కలిసికట్టుగా శ్రమించాలన్నారు. ప్రజలను మోసపూరిత మాటలతో మభ్యపెడుతున్న ప్రభుత్వాన్ని గద్దెదించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్రాచారి, గ్రామస్తులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపొందాలని మండల కేంద్రానికి చెందిన బుర్ర అంజయ్యగౌడ్ కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం వేములవాడ రాజన్న ఆలయంలో మొక్కులు చెల్లించారు. ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు.

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్‌కు చెందిన ఉపసర్పంచ్ కుమారస్వామి ఆధ్వర్యంలో మెట్‌పల్లికి చెందిన సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు పాపిరెడ్డి, పలువురు యువకులు శుక్రవారం కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సత్యనారాయణ పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కవ్వంపల్లి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకుల మోసపూరిత మాటలు నమ్మకనే పార్టీలో చేరుతున్నారని అన్నారు.

నేడు ప్రజా ఆశీర్వాద ర్యాలీ



గులాబీమయంగా అంబేడ్కర్ చౌరస్తా

హుజూరాబాద్: హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పాడి కౌశిక్‌రెడ్డిని సీఎం కేసీఆర్ ప్రకటించిన తర్వాత శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్‌కు వస్తున్నారు. భారీ స్వాగతం, పెద్ద ఎత్తున జనసమీకరణ చేసి ప్రజా ఆశీర్వాద ర్యాలీ నిర్వహించేందుకు గులాబీ శ్రేణులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం డిపో క్రాస్ రోడ్డు నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరుకానున్నారు. హుజూరాబాద్ పట్టణం గులాబీ మయమైంది. ఎన్నికల ప్రచారాన్ని తలపించేలా నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అనాథ పిల్లలకు ఆర్థికసాయం

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో అనారోగ్యంతో తల్లి మృతి చెందగా, తండ్రి ఇంటి నుంచి వెళ్లి పోవడంతో అనాథలైన ఇద్దరు చిన్నారులకు శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థవారు రూ.5 వేల ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. సేవా సంస్థ అధ్యక్షుడు కనకయ్య, ప్రధాన కార్యదర్శి దాసరి రవిశాస్త్రి, గౌరవ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, సాయికుమార్, మల్లేశం, సిద్ధు, మల్లేషం, శేఖర్, వెంకటేశ్, రాజశేఖర్ పలువురు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి...

వీణవంక: మండలంలోని ఎల్బాక గ్రామానికి చెందిన కోట శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ప్రమదవశాత్తు బావిలో పడి మృతిచెందగా ఆయన కుటుంబానికి యూప్‌టీవీ అధినేత పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి రూ.5వేలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పచ్ కాంతరెడ్డి, రొండ్ల రాజకొమురయ్య, గోవిందరెడ్డి, గౌతంరెడ్డి, సందీప్, వివేక్, రామ్‌రెడ్డి, ప్రభాకర్, లోకేశ్, వంశీకృష్ణ, కుమారస్వామి, చిన్నాల శ్రీకాంత్, తోట్ల రాకేష్, కొమ్ము అఖిల్ తదితరులు పాల్గొన్నారు.